## క్లుప్తంగా

### కౌలు రైతు ఆత్మహత్యపై విచారణ



విచారణ జరుపుతున్న ఆర్డీఓ

**కోవెలకుంట్ల:** మండలంలోని కలుగొట్ల గ్రామానికి చెందిన రామానాయుడు(40) అనే కౌలు రైతు అప్పుల బాధ తాళలేక ఆగస్టు 31వ తేదీ ఆత్మహత్య చేసుకున్నారు. రైతు ఆత్మహత్యపై శుక్రవారం డోన్ ఆర్డీఓ ఉమామహేశ్వరరెడ్డి గ్రామంలో విచారణ చేశారు. మృతుని భార్య లక్ష్మీదేవి, చుట్టుపక్కల రైతుల నుంచి వివరాలు సేకరించారు. రామానాయుడు ఎన్నేళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నారు? ఏఏ పంటలు పండిస్తున్నారు? బ్యాంకులు, ప్రైవేట్ వ్యక్తుల నుంచి తీసుకున్న రుణాలపై ఆరా తీశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి నిరంజన్, రేవనూరు ఎస్‌ఐ భూపాలుడు, ఆర్‌ఐ ఇమ్రాన్, వీఆర్‌ఓ నాగమద్దిలేటి ఉన్నారు.

### సారా ఊట ధ్వంసం



కుండలను ధ్వంసం చేస్తున్న ఎస్‌ఐ

**ప్యాపిలి:** జలదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని డి. రంగాపురం శివారులో నాటుసారా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ నాగార్జున ఆధ్వర్యంలో పోలీసులు 20 డ్రమ్ములు, 15 మట్టి కుండల్లో నిల్వ ఉన్న 2,500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 100 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారు చేస్తున్న ఎరుకల ఈశ్వరయ్య, శంకర్ పోలీసులను చూసి పారిపోయారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

**బేతంచెర్ల:** మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామంలో సారా విక్రయిస్తున్న లొద్ద మద్దిలేటిని శుక్రవారం అరెస్టు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి తెలిపారు. అతని వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. రిమాండ్ నిమిత్తం డోన్ కోర్టులో హాజరుపరిచారు.

### సాగునీటి ఉద్యమ నేత వేణుగోపాల్‌రెడ్డి మృతి



కామని వేణుగోపాల్ రెడ్డి (ఫైల్)

**కోవెలకుంట్ల:** పట్టణానికి చెందిన సాగునీటి ఉద్యమ నేత, రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కోఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి(73) శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. 24 ఏళ్ల క్రితం కుందూనది పోరాట సమితి కన్వీనర్‌గా సాగునీటి విడుదల కోసం అనేక పోరాటాలు చేశారు. అవుకు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు, సిద్దేశ్వరం అలుగు ఏర్పాటు కోసం రైతుల పక్షాన ఆందోళనలు చేశారు. సాయంత్రం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

**వేణుగోపాల్‌రెడ్డి మృతి బాధాకరం**

**కోవెలకుంట్ల:** కోవెలకుంట్ల సాగునీటి ఉద్యమ నేత కామని వేణుగోపాల్‌రెడ్డి మృతి బాధాకరమని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. కామని మృతిపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన సేవలను కొనియాడారు.

### నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**సంజామల:** మండల పరిధిలోని ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం పేరుసోముల హైస్కూల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో నితిన్, కార్తీక్, జాఫర్, ఉయ్యాలవాడ మహమ్మద్ వశీం, బాలికల విభాగంలో సౌమ్య, ప్రవల్లిక, మనశ్విని, రూపారాణి, బిందుశ్రీ ఎంపికయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బాబును హెచ్‌ఎం అభినందించారు.

### ఇద్దరికి జరిమానా

**బనగానపల్లె రూరల్:** మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ రహిమాన్ జరిమానా విధించినట్లు బనగానపల్లె టౌన్ సీఐ కృష్ణయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని మీరాపురం గ్రామానికి చెందిన చల్లా వడ్డె సాయికుమార్, సాహెబ్‌గారి హుస్సేన్‌వలి మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. కోర్టు వడ్డె సాయికుమార్‌కు రూ.10 వేలు, సాహెబ్‌గారి హుస్సేన్‌వలికి రూ.5 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

# హామీలు.. నీటి బుడగలు

- ఎన్నికల ప్రచార హామీలు గాలికి
- ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం ఉత్తిదేనా
- బనగానపల్లెకు రింగ్ రోడ్ కలేనా
- కోవెలకుంట్లకు బైపాస్ లేనట్లేనా
- వంద రోజుల చంద్రబాబు పాలనపై ప్రజల అసంతృప్తి





బనగానపల్లె రోడ్‌షో సమావేశంలో హామీలు గుప్పిస్తున్న చంద్రబాబు(ఫైల్), బైపాస్ లేకపోవడంతో కోవెలకుంట్లలో ఏర్పడిన ట్రాఫిక్

**కోవెలకుంట్ల:** చంద్రబాబు మాటల మనిషని.. గాల్లో మేడలు కట్టే మాయల మనిషి అని మరోసారి రుజువైంది. 2014 ఎన్నికల సమయంలో 600కు పైగా హామీలిచ్చి అధికారంలోకి రాగానే ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జనసేన, బీజేపీతో కూటమిగా ఏర్పడి అధికారం కోసం అనేక అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి శుక్రవారానికి వంద రోజులు పూర్తి అవుతోంది. ఎన్నికల సమయంలో బనగానపల్లెకు వచ్చిన చంద్రబాబు, టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రజలకు అనేక హామీలిచ్చారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రెండు సెంట్ల స్థలాన్ని మంజూరు చేస్తామని, బనగానపల్లెకు రింగ్‌రోడ్, కోవెలకుంట్లకు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మూడు నెలలు గడిచినా హామీల ఊసెత్తడం లేదు.

**సొంతింటి కల నెరవేరేనా?**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు పక్కా గృహాలు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి మూడు విడతల్లో రూ. 1.80 లక్షలు బిల్లులు, ఉచితంగా 20 టన్నుల ఇసుక, రాయితీపై కడ్డీలు, సిమెంట్, ఇంటి నిర్మాణ సామాగ్రి సరఫరా చేసింది. అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బనగానపల్లె పట్టణంలో 3 వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయించారు. పేదలకు ఇంటి స్థలాలు అందకూడదన్న ఉద్దేశంతో అప్పటి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఆర్‌అండ్‌బీ రోడ్డు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కోర్టును ఆశ్రయించి పేదలకు ఇళ్లస్థలాలు అందకుండా అడ్డుకున్నారు. దీంతో గడిచిన ఐదేళ్లలో పేదలు ఇళ్లస్థలాలు, పక్కా గృహాలకు నోచుకోలేదు. 2024 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ఏడాది మార్చి 29వ తేదీ బనగానపల్లెకు వచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గంలోని అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి రెండుసెంట్ల ఇళ్లస్థలం కేటాయిస్తామని బీసీ జనార్దన్‌రెడ్డి రోడ్‌షో సమావేశంలో చంద్రబాబుతో చెప్పించారు. అధికారం చేపట్టి వంద రోజులు దాటినా ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పేద కుటుంబాలకు సొంతింటి కల అందనంత దూరంలో ఉంది.

**బనగానపల్లెకు రింగ్‌రోడ్డు, కోవెలకుంట్లకు బైపాస్ ఎప్పుడో**

2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బనగానపల్లెకు రింగ్ రోడ్డు ఏర్పాటుకు రూ. 100 కోట్లు, కోవెలకుంట్ల పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ. 50 కోట్లు నిధులు మంజూరు చేసింది. నిధులు కేటాయించినా రోడ్ల నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అప్పట్లో నిధులు వెనక్కు వెళ్లాయి. ఆయా పట్టణాల్లో భారీ వాహనాలు నిత్యం తిరుగుతుండటంతో రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తి ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్లపై భారీ వాహనాలు నిలిచి గంటల తరబడి రాకపోకలు స్తంభించిపోతున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో తిరిగి ఇదే అంశాన్ని తెరపైకి తెచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రింగ్ రోడ్డు, బైపాస్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని బీసీ జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రస్తుతం బీసీ జనార్దన్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా ఉన్నారు. రింగ్‌రోడ్డు, బైపాస్‌రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. బనగానపల్లె, కోవెలకుంట్ల పట్టణాల్లో ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు మాత్రం తప్పడం లేదు.

### ప్రజల కష్టాలు తీర్చాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల కష్టాలు తీర్చాలి. గ్రామీణ ప్రాంతాల్లో సొంతిల్లు లేక ఎంతో మంది పేదలు అద్దె ఇళ్లలో నివాసం ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. కూలి పనికి వెళితే కాని పూటగడవని పరిస్థితుల్లో ఇంటి అద్దె భారంగా మారి అవస్థలు పడుతున్నారు. ఇళ్లు లేని ప్రతి కుటుంబాన్ని గుర్తించి రెండు సెంట్ల ఇంటి స్థలం తోపాటు పక్కాగృహం కేటాయించి ఆదుకోవాలి.

–ప్రతాప్‌రెడ్డి, భీమునిపాడు, కోవెలకుంట్ల

### ట్రాఫిక్ కష్టాలు తొలగించాలి



కోవెలకుంట్ల, బనగానపల్లె పట్టణాల్లో వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. ప్రతి రోజు భారీ వాహనాలు తిరుగుతుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతోంది. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బనగానపల్లెకు రింగ్‌రోడ్డు, కోవెలకుంట్లకు బైపాస్ రోడ్డు హామీలను నెరవేర్చి ప్రజల కష్టాలు తీర్చాలి.

–జగన్‌మోహన్‌రెడ్డి, కోవెలకుంట్ల

### క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్

**కొలిమిగుండ్ల:** విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగినప్పుడే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లి తండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని.. వారి ఆశలకు అనుగుణంగా నడుచుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టపడితేనే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని తెలిపారు. సెల్‌ఫోన్‌లు, సినిమాలతో సమయం వృథా చేసుకోకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. చెడు అలవాట్లు, చెడు స్నేహానికి దూరంగా ఉండాలని చెప్పారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు అనుగుణంగా కృషి చేయాలని సూచించారు. సమాజంలో గుర్తింపు వచ్చే పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ రమేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవికుమార్

**కొలిమిగుండ్ల:** గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ డీఎస్పీ రవి కుమార్ హెచ్చరించారు. శుక్రవారం సీఐ రమేష్ బాబుతో కలిసి సమస్యాత్మక గ్రామమైన అంకిరెడ్డిపల్లెను సందర్శించి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. చిన్న విషయాలకు గొడవలకు పాల్పడరాదని సూచించారు. గొడవలు జరుగకుండా ఉండేందుకు గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని ఎవరైనా హద్దు మీరి గొడవలు సృష్టిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. నాటుసారా, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

### కనుల పండువగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ

**బనగానపల్లె రూరల్:** మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవికి శుక్రవారం పల్లకీ సేవను కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

### వేడుకగా తిరుచ్చి ఉత్సవం



పల్లకీపై విహరిస్తున్న మద్దిలేటి నరసింహస్వామి

**బేతంచెర్ల:** మండలంలోని రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో భాద్రపద మాసం శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష పూజలు చేశారు. వివిధ పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆశీనులను చేశారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## వాల్మీకులు పార్టీలకతీతంగా ఏకం కావాలి

**ప్యాపిలి:** వాల్మీకి జయంతి ఉత్సవాల్లో వాల్మీకులంతా పార్టీలకతీతంగా ఏకం కావాలని ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న అన్నారు. శుక్రవారం ప్యాపిలిలో వాల్మీకి విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల 17న నిర్వహించనున్న వాల్మీకి జయంతిని విజయవంతం చేయాలని కోరారు. వాల్మీకులు ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాల గురించి ఆలోచించాలన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా అందరూ ఐక్యతతో సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. వాల్మీకులను ఓటు బ్యాంకుగా పరిగణిస్తున్న రాజకీయ పార్టీలకు గట్టి గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఆర్పీఎస్ నాయకులు హనుమప్ప, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, నాగరాజు, చౌడప్ప, శ్రీధర్, కలచట్ల నాగరాజు, ధర్మారం చంద్ర, మధు తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకులను ఉద్దేశించి మాట్లాడుతున్న సంఘం నాయకులు

### మొక్కల పెంపకం అందరి బాధ్యత

**కొలిమిగుండ్ల:** పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొలిమిగుండ్లలోని పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. పర్యావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని.. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో మొక్కలు నాటించాలన్నారు. చెట్లను నరికివేయకుండా సంరక్షించాలన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు

కార్యక్రమంలో ఏపీఓ గంగన్న, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నీరు వృథా.. రైతు వ్యథ

**బనగానపల్లె:** మండలంలోని కైప చెరువు నుంచి నీరు వృథాగా కోవెలకుంట్ల సమీపంలోని కుందూ నదిలో కలుస్తోంది. ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ 9వ బ్లాక్ పక్క భాగంలో కైప చెరువులోకి నీరు వచ్చేలా భారీ షెట్టర్ ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి నీరు కైప చెరువులోకి చెరుతుంది. కైప చెరువులోకి చేరిన నీరు కైప, చిన్నకొప్పెర్ల, పెద్ద కొప్పెర్ల గ్రామాల్లోని సుమారు 200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే అధికారులు పంట కాల్వలు ఏర్పాటు చేయనందున సాగునీరు అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట కాల్వలు ఏర్పాటు చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



చెరువు నుంచి వృథాగా పోతున్న నీరు

### 24న మండల స్థాయి క్రీడా పోటీలు

**కొలిమిగుండ్ల:** స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 24న మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు రాజయ్య, అబ్దుల్ కలాం శుక్రవారం తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేస్తామని చెప్పారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కోవెలకుంట్ల:** స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ పరిధిలోని కోవెలకుంట్ల, దొర్నిపాడు మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. మూడో శనివారం సందర్భంగా ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

**సంజామలలో..**

**సంజామల:** మండల కేంద్రంతో పాటు పేరుసోముల, ఆకుమల్ల, నొస్సం సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు.

**ఉప్పలపాడు సబ్‌స్టేషన్ పరిధిలో..**

**అవుకు:** మండల పరిధిలోని ఉప్పలపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ పక్కీరయ్య తెలిపారు.

**బేతంచెర్లలో..**

**బేతంచెర్ల:** మండల పరిధిలోని శంకరాపురం, బేతంచెర్ల ఫీడర్లలో మరమ్మతు పనుల కారణంగా ఆర్‌ఎస్ రంగాపురం సబ్‌స్టేషన్ మినహా మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

### ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్స్ మంజూరు చేయాలి

**బనగానపల్లె:** ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని తహసీల్దార్ నారాయణరెడ్డికి యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు కె. సత్యప్రకాష్ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. వేసవి సెలవుల్లో సాధారణ ఎన్నికల కోసం 6,7 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు, 12,13 తేదీల్లో పోలింగ్ కేంద్రాల నిర్వహణ విధులు, 14న ఆన్‌డ్యూటీగా పరిగణించారు. అందు వల్ల ఎన్నికల నిర్వహణ విధులు నిర్వహించిన వారికి డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు.

### ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

**బనగానపల్లె రూరల్:** అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కైప గ్రామానికి చెందిన ఎం.హుస్సేన్‌బాషా(37) పలువురి వద్ద అప్పులు చేశాడు. తీర్చలేనని భావించి గురువారం పరుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి భార్య నూరాన్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు

**బేతంచెర్ల:** పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన బాల మహేష్ పూదోట పాలిష్ ఫ్యాక్టరీ వద్ద నడుచుకుంటూ వస్తుండగా ఏపీ 21టీఈ 2641 నంబర్ ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాల మహేష్‌కు కాలు విరగడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కొమ్మూరు కొట్టాల గ్రామానికి చెందిన మనోహర్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

### విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**బనగానపల్లె రూరల్:** పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కమ్యూనిటీ ఔట్రిచ్ ప్రోగ్రామ్-2024 (సైన్స్ ప్రదర్శన) శుక్రవారం ముగిసింది. ఉత్తమ ప్రాజెక్టులు రూపొందిన విద్యార్థులకు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఫిజిక్స్ ల్యాబ్ ఇన్‌చార్జ్ కామేశ్వరరావు, అధ్యాపకులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం నాగేశుడు

**కోవెలకుంట్ల:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎంలు నాగేశుడు, అరుణకుమారి ప్రారంభించారు. మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బాలబాలికలకు అండర్ -14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, బాల్‌బాడ్మింటన్, యోగా, చెస్, తదితర పోటీలు నిర్వహించారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని హెచ్‌ఎంలు తెలిపారు. మండలస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఆయా పాఠశాలల పీడీలు జరీనా, సువర్ణ, ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, హర్షవర్ధన్, ఉసేన్‌వలి, పార్వతి, చౌడయ్య, సుధీర్, అక్బర్, ఓబులేసు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి

**క్రీడలతో ఉజ్వల భవిష్యత్**

**అవుకు:** విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం అవుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంఈఓ-1,2 శ్రీధర్‌రావు, వెంకటేశ్వర రెడ్డితో కలిసి మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. అవుకులోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాల, గుండ్లశింగవరం, అవుకు బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహించామని తెలిపారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేస్తారని చెప్పారు. విద్యార్థులు ప్రతిభ చాటాలన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీలు పాల్గొన్నారు.

### వర్షం కోసం భజన

**కొలిమిగుండ్ల:** వానదేవుడు కరుణించాలని నాయినపల్లెకు చెందిన భజన బృందం సభ్యులు రెండు రోజుల నుంచి రామదండు పేరుతో భజన చేస్తున్నారు. కొలిమిగుండ్లలో ప్రారంభించి ఇటిక్యాల, కనకాద్రిపల్లె, పెట్నికోట మీదుగా నాయినపల్లెకు చేరుకుంటామని భజన బృందం సభ్యులు చెప్పారు. ఆయా గ్రామాల్లో భక్తి గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగుతున్నారు. వర్షాలు లేక కరువు ఛాయలు ఏర్పడడంతో పంట ఎండిపోయాయని.. బోర్లలో నీళ్లు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో కళకళలాడాలనే ఉద్దేశంతో గ్రామాల్లో భజన చేస్తున్నట్లు చెప్పారు.

### నాగతిమ్మయ్యకు డాక్టరేట్

**బేతంచెర్ల:** మండల పరిధిలోని శంకరాపురం గ్రామానికి చెందిన నాగతిమ్మయ్య వైబీఎస్ యూనివర్సిటీ (రాంచి) నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఈయన నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తూ రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన కస్టమర్ల ప్రాధాన్యత, సంతృప్తి స్థాయి పదాలకు స్మార్ట్‌ఫోన్ బ్రాండుల అధ్యయనం అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. తన గైడ్ దేవేంద్ర కుమార్ ఓజకి, రిసెర్చ్ డీన్ డాక్టర్ రవి భూషణ్, మంజులకు కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టరేట్ అందుకుంటున్న తిమ్మయ్య

### కాల్వలు, చెరువు స్థలాలను కాపాడండి

**డోన్ టౌన్:** అక్రమ కట్టడాలను తొలగించి వంకలు, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ నాగమణికి న్యూడెమోక్రసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద కాల్వను (సర్వే నంబరు 327) కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, విచారించి చర్యలను తీసుకోవాలని న్యూడెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యులు రంగనాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు దొరపల్లె రాజు, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి బందిన నవాజ్‌వలి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

### దోమల ద్వారా వ్యాధుల వ్యాప్తి

**ప్యాపిలి:** దోమల ద్వారానే వ్యాధులు వ్యాప్తి చెందుతాయని హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్రగౌడ్ అన్నారు. స్థానిక ఒకటి, నాలుగో సచివాలయాల పరిధిలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు.

**నీటిని ఎక్కువ కాలం నిల్వ ఉంచొద్దు**

**డోన్:** ఇంటిలో నీరు నిల్వ ఉంచుకునే పాత్రలను వారంలో ఓ రోజు ఖాళీ చేసి ఆరబెట్టాలని.. దీని వల్ల దోమ లార్వాలు నశిస్తాయని మున్సిపల్ కమిషనర్ జయరాం అన్నారు. శుక్రవారం మహాలక్ష్మి వీధి, మాకం వీధిలో పర్యటించారు. స్థానికులకు అవగాహన కల్పించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

### చెకుముకి పోటీల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

**డోన్ టౌన్:** ఈ నెల 25వ తేదీ జరగనున్న చెకుముకి పోటీలకు సంబంధించి వాల్ పోస్టర్లను పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో 8,9,10వ తరగతి విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

**బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు**

**బేతంచెర్ల:** మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న దేరంగుల గుండన్నను అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప శుక్రవారం తెలిపారు. మద్యం విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారంతో దాడి చేసినట్లు చెప్పారు. నిందితుడి నుంచి 19 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.